క్లుప్తంగా

ముంబాయిలో 'పేట' ఎమ్మెల్యే



నారాయణపేట: ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన జాతీయ శాసన సభ్యుల సమావేశానికి నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు.

ఎస్‌ఐగా బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ మల్లేష్

మాగనూర్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌ఐగా మల్లేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నరేందర్‌ను వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు బదిలీ చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి మల్లేష్ మండల కేంద్రానికి బదిలీపై వచ్చారు. అంతకుముందు నూతన ఎస్‌ఐ ఎస్పీ వెంకటేశ్వర్లును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

నారాయణపేట రూరల్: పట్టణంలోని మూడు మార్గాల్లో రోడ్డు వెడల్పు చేసి, దానికి అనుగుణంగా డివైడర్లను నిర్మించాలన్నారు. వాహదారులు, పాదాచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన సూచిక బోర్డులను విస్మరించారని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ ఈఈని కలిసి వినతిపత్రం అందించారు. హెచ్చరిక బోర్డులు, యూటర్న్, పాదాచారుల కోసం జీబ్రాక్రాసింగ్ తదితర వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

రేపు వైద్య శిబిరం

నారాయణపేట రూరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఎస్ఆర్ గార్డెన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు మొగ్లాన్ జనార్దన్ తెలిపారు. డయాబెటిస్ ఫుడ్ నివారణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడంతో పాటు కంటి సమస్యలు, గుండె సంబంధమైన వ్యాధులపై పరీక్షలు చేస్తామన్నారు. ప్రముఖ జనరల్ ఫిజీషియన్ గందె కార్తీక్ ఆధ్వర్యంలో ఉస్మానియా మెడికల్ కాలేజీ ఎండ్రోక్రైనలాజిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలవేణితో పాటు స్థానిక వైద్యులు విశ్వనాథ్, ఆదిత్యగౌడ్, మల్లికార్జున్, గగన్, ప్రణయ్ హాజరవుతున్నట్లు చెప్పారు.



ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో శుక్రవారం ముత్తూట్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో కిడ్నీ, గుండె, లివర్, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి రిపోర్టులను అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు విజయన్‌గౌడ్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి ఉచితంగా మందులు అందిస్తామని, డయాలసిస్ రోగులకు ఆర్థికసాయం అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నసూరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ పెద్ద సూరయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, నిర్వాహకులు విజయన్‌గౌడ్, సియిశంకర్‌గౌడ్, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని నిడ్జింతలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రి సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి, చెవి, ముక్కు, నరాలు, హృదయ తదితర సంబంధిత వైద్యులు 400 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 60 మందికి ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ కాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై కేసులు ఎత్తివేయాలి

నారాయణపేట రూరల్: విద్యావేత్తలు, హక్కుల నేతలపై రాష్ట్ర ప్రభుత్వం అనుసర్తిస్తున్న ధోరణి అసమంజసమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ విమర్శించారు. గత ఆగస్టులో ములుగు జిల్లాలో జరిపిన కూంబింగ్ ఆపరేషన్‌లో దొరికిన నక్సలైట్లకు చెందిన సామగ్రిలో ఉన్న పుస్తకాల్లో పేర్లు చూసి వారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. వెంటనే 152మంది టీచర్లపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

అందుబాటులో గ్రంథాలయం

- జిల్లాలోనే మొదట ఏర్పాటు
- గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ
- పోటీ పరీక్షల కోసం ప్రత్యేక యాప్



కిష్టాపూర్ గ్రాంథాలయ భవనం



కిష్టాపూర్‌లో ఏర్పాటు చేసిన నూతన గ్రాంథాలయం

ధన్వాడ: యువతను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు, చిన్నారులు చక్కని కథల పుస్తకాలు చదివేలా ఆకర్శించడం, పెద్దలకు రోజూ వార్తలు చదివే విధంగా పత్రికలు అందుబాటులో ఉంచుతూ కిష్టాపూర్ గ్రామ పంచాయతీ ఆదర్శగా నిలుస్తోంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఆన్‌లైన్ గ్రంథాలయం ఏర్పాటు చేయడంతో యువత ఆసక్తి చూపుతున్నారు. సర్పంచ్ దామోదర్‌రెడ్డి కూమరుడు అచ్యుతారెడ్డి లండన్‌లో నివాసం ఉంటున్నాడు. గ్రామంలో విద్యార్థులకు గ్రంథాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న అయన తండ్రికి పలు సూచనలు అందించి గ్రామ పంచాయతీ కమిటీ అనుమతితో ఈ గ్రంథాలయం ఏర్పాటు చేయాలని సూచించారు. పంచాయతీ భవనం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో రూ.15లక్షలతో నూతన గ్రంథాలయ భవనం నిర్మాణం చేశారు. రెండు అంతస్తులు నిర్మించిన భవనంలో కింద షాపింగ్ సముదాయం, మొదటి అంతస్తులో గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక పుస్తకాలు

అన్ని వయస్సుల వారికి అనుగుణంగా ఉండేలా పుస్తకాలను జాగ్రత్తగా ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని తార్నాకలోని ఓ బుక్‌స్టాల్ నుంచి ఐదేళ్ల వయస్సు పైబడిన అందరికీ వారి అభిరుచికి అనుగుణంగా పుస్తకాలను కొనుగోలు చేశారు. చిన్న పిల్లలు పుస్తకాలు చదివేలా ఆకర్శించడం వెనుక ప్రత్యేక ఉద్దేశం ఉందని వారికి చదువుపై ఆసక్తి రేకెత్తించి అకాడమిక్ ఎక్సలెన్స్‌కు దారితీస్తుందని ఆశిస్తున్నారు. పోటీ పరీక్షల కోసం యువకులకు రెండు సెట్ల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అలాగే కంప్యూటర్లను ఏర్పాటు చేసి వాటికి ఇంటర్‌నెట్ కనెక్షన్ ఏర్పాటు చేశారు. www.entri.app ని ఉపయోగించి స్పోకెన్ ఇంగ్లీష్, సాఫ్ట్ స్కిల్స్ కంటెంట్‌ను అందిస్తున్నారు. ఈ యాప్ ద్వారా టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్ పోస్టులు, పోలీస్ పరీక్షల వంటి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధయయ్యే ఆసక్తి ఉన్నవారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని, ప్రాక్టీస్ టెస్ట్‌లతో పాటు శిక్షణ వీడియోలను అందిస్తున్నట్లు పంచాయతీ వారు తెలిపారు.



కంప్యూటర్‌ను నేర్చుకుంటున్న చిన్నారులు

యువత కోసం



గ్రామంలో యువత పోటీ పరీక్షల కోసం హైదారాబాద్‌కు వెళ్లి డబ్బులు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. మా గ్రామంలో వారికి అన్ని వసతులు సమకూర్చితే అందరికీ ఉపయోగపడుతుందని ఆలోచించి పంచాయతీ నిధులతో గ్రంథాలయం ఏర్పాటు చేసాం. పోటీ పరీక్షలతో పాటు అందరికీ అందుబాటులో ఉండేలా పుస్తకాలు, ఇంటర్‌నెట్, కంప్యూటర్లను అందుబాటులో ఉంచాం. ఇందుకు సహకరించిన గ్రామస్తులందరికీ ధన్యవాదాలు.

– దామోదర్‌రెడ్డి, సర్పంచు, కిష్టాపూర్

మూడోసారి అధికారంలోకి రావడం ఖాయం

మరికల్: ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి రాష్ట్రంలో వరుసగా బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి దోహదపడుతుందని ఆ పార్టీ బీసీ యూత్ మండల అధ్యక్షుడు గాదం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రజా సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీలు ఆరోపణలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 60 ఏళ్లుగా పాలన చేసిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకుందని ఆరోపించారు. కొత్తగా ఏర్పాటైన నారాయణపేట జిల్లా రూపురేఖలు మార్చిన ఘనత ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇవన్నీ ప్రతిపక్షాలకు కన్పించడం లేదా అంటూ వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో అప్పంపల్లి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, ప్రకాశ్‌శెట్టి, శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి, కొండయ్య, నరహరి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

మాగనూర్: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారు జామున ఓ గుర్తు తెలియని లారీ ట్రాక్టర్ ట్రాలీతో పాటు ఆటోను ఢీకొట్టిన ఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం కమాన్ సమీపంలో ఎన్‌హెచ్ – 167 రోడ్డు పక్కన ప్రతిరోజు ట్రాక్టర్ ట్రాలీ, ఆటో నిలుపుతారు. వేసవికాలంలో కొందరు యువకులు ట్రాలీలో నిద్రిస్తున్నారు. అదృష్టవశాత్తు గురువారం రాత్రి ఎవరు నిద్రింకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.

ఆగ్రోస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న పీఓ విన్సన్

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ రైతువేదికలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకులకు ఆ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ పీఓ విన్సన్ మాట్లాడుతూ.. 2023–24 వర్షాకాలానికి సంబంధించి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచామన్నారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్‌బుక్స్ నిర్వహణ సరిగా ఉండాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ ఉదయ్‌కాంత్, ఏఓ ప్రదీప్, సూపర్‌వైజర్ నివేదిత, సాయిభరత్, అశోక్, పరశురాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, అంజప్ప, గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుర్వ నర్సింహులు కుమారుడు నరేందర్ నీట్ పరీక్షల్లో 524 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌కు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప విద్యార్థి నరేందర్‌ను సన్మానించారు. అనంతరం మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భూత్పూర్ సర్పంచ్ కుర్వ హన్మంతు, శ్రీనివాసులు, కుర్వ ఆశప్ప, గజ్జలప్ప తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మాగనూర్: అపరిచిత వ్యక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళాబృందం సభ్యుడు సురేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని అడవిసత్యరం, అమ్మపల్లిలో సైబర్‌నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్ చేసి మీకు లాటరీలు తగిలాయి, లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే వస్తువులు వస్తాయని చెప్పి ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. సైబర్‌నేరానికి గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తుల పట్ల అనుమానం ఉన్న వెంటనే డయల్ 100 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, కళాబృందం కానిస్టేబుల్స్ శేఖర్, లింగన్న, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



అమ్మపల్లిలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచుదాం



నారాయణపేట రూరల్: సామాజికంగా వెనకబడిన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వం చూయిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాబోయే రోజుల్లో మండల సాధన ఆధ్వర్యంలో ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచుదామని సీపీఎం జిల్లా సెక్రెటరీ వెంకట్రామారెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు శుక్రవారం నాటికి 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఐద్వా మహిళా సభ్యులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు రాము, కెంచె శ్రీనివాస్, యాదగిరి, కాశీనాథ్, బలరాం, వెంకట్రాములు, నర్సింహులు, చెన్నప్ప, సౌజన్య, మల్లేష్, రాజేశ్వరి, చంద్రకళ, వెంకటమ్మ, శకుంతల, అమృతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మక్తల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ గోవింద్ రాజ్ అన్నారు. శుక్రవారం అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు టీఏ, డీఏ, ఇంటి అద్దె ఇవ్వాలని కోరారు. పని భారం, అధికారులు వేధింపులు తగ్గించాలన్నారు. అనంతరం తమ సమస్యలను పరిష్కారం చేయాలని అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఆయన ఐసీడీఎస్ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, రాధిక, యశోద, శ్రీలత, రాజేశ్వరి, నర్సింగమ్మ, సుజాత, సువర్ణ, దుర్గాబేగం తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ఇసుక డంపులు సీజ్



నారాయణపేట రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను శుక్రవారం రాత్రి రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. మండలంలోని బైరంకొండ శివారులో అనుమతి లేకుండా సమీప వాగుల నుంచి ఇసుకను తోడి రెండు డంపులుగా నిల్వ ఉంచారు. దాదాపు 20 ట్రాక్టర్ల మేర ఇసుక ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ ప్రతాప్‌రెడ్డి బైరంకొండలో ఇసుక డంపులను పరిశీలించారు. వాటికి సంబంధించిన ఆధారాలు చూయించకపోవడంతో సీజ్ చేసి వీఆర్ఏ వెంకటేష్‌కు అప్పగించినట్లు తెలిపారు.

పట్టణ ప్రగతితో అద్భుత ఫలితాలు



నారాయణపేట: పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల పెరుగుదల, మెరుగైన పారిశుద్ధ్యం, పచ్చదనం పెంచడమే లక్ష్యంగా మొదలు పెట్టిన పట్టణ ప్రగతి కార్యక్రమంతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నమని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణ ప్రగతి నివేదిక స్థానిక మున్సిపాలిటీలోని జీపీ శెట్టి ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సతీమణి స్వాతిరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ అనసూయ మాట్లాడుతూ పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధిపై చెప్పుకోవాలంటే రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తర్వాత అని చెప్పక తప్పదన్నారు. కార్యక్రమాలు మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, కమిషనర్ సునీత, కౌన్సిలర్లు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతం

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాల్లో టెన్త్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించగా శుక్రవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 54మంది రాయాల్సి ఉండగా.. 20మంది మాత్రమే హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మక్తల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం..

ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 12 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్‌లో విభాగంలో 1,585 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 1,527మంది హాజరయ్యారు. ఒకేషనల్‌లో 58మందికి గానూ 56మంది పరీక్ష రాశారు. అదేవిధంగా సెకండ్ ఇయర్‌లో జనరల్ 599 మందికి గానూ 568, ఒకేషనల్‌లో 23 మందికి గానూ 21మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా తనిఖీ బృందం కోస్గి, మద్దూర్, నారాయణపేట, ఫ్లయింగ్‌స్క్వాడ్ మరికల్, ధన్వాడ, సిట్టింగ్ స్క్వాడ్ మక్తల్, కోస్గిలో పర్యటించారు.

ఇద్దరు ఎస్‌ఐలకు పదోన్నతి

నారాయణపేట రూరల్: జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్‌ఐలకు పదోన్నతి లభించింది. మక్తల్, ఊట్కూర్ ఎస్‌ఐలుగా విధులు నిర్వహించి ఇటీవల డీసీఆర్‌బీ ఎస్‌ఐగా బదిలీపై వచ్చిన రాములు, చెక్‌పోస్టు డ్యూటీ నుంచి ఇటీవల టౌన్ ఎస్‌ఐగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మణ్‌నాయక్‌లకు సీఐలుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఎస్పీ వెంకటేశ్వర్లు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు

అమరచింత: స్త్రీ నిధి డబ్బులు కాజేశారంటూ తనపై మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజా తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని శ్రీచైతన్య ఏరియా లెవెల్ ఫెడరేషన్ సంఘం ఆర్పీ రఘు అన్నారు. తన పరిధిలోని సంఘాల సభ్యుల పొదుపు డబ్బులతో పాటు స్త్రీనిధి డబ్బులు రూ.4.2లక్షలు వరకు బ్యాంకులో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నానని అనడంలో నిజం లేదన్నారు. సిరిమల్లె సంఘంలో తన తల్లి సువార్తమ్మ బ్యాంకులో రుణం తీసుకున్నారని తెలిపారు. తన ఆర్థిక ఇబ్బందుల కారణంగా 17 నెలలుగా దానికి సంబంధించిన

చెరువు పాటు కాల్వల పరిశీలన

ఊట్కూరు: మండల కేంద్రంలోని పెద్ద చెరువు పాటు కాల్వలను శుక్రవారం ఐబీ అధికారులు పరిశీలించారు. చెరువు కట్ట పరిసరాలతో పాటు అలుగు, తూము, పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేష్, స్థానికులు రాములు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న అధికారులు

టీ టీడీపీ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కోస్గి: హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో టీటీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను శుక్రవారం స్థానిక నాయకులు కలిశారు. రాష్ట్ర కమిటీ ఏర్పాటులో కొడంగల్ నియోజకవర్గానికి సముచిత స్థానం కల్పించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములుతోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఆదాయ, కుల ధ్రువపత్రాల కోసం బారులు



కార్యాలయం ఎదుట ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

ధన్వాడ: కుల, ఆదాయ ధృవపత్రాల కోసం శుక్రవారం వివిధ గ్రామాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బారులు తీరారు. వారం రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నా నేటికీ ధృవపత్రాలు మంజూరు చేయడం లేదని దరఖాస్తు దారులు వాపోయారు. ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయం వద్దే పడిగాపులు కాస్తున్నా పట్టించుకోవడం లేదని, డబ్బులు ఇచ్చిన వారికి ముందుగా పని చేసి పంపిస్తున్నారని ఆరోపించారు. ఒక సర్టిఫికేట్‌కు రూ.వెయ్యి వరకు డిమాండ్ చేస్తున్నారని, ఇస్తే పని తొందరగా.. లేదంటే పక్కన పడేసి తేదీల వారిగా చూస్తాం పోండి అని పంపిస్తున్నారని ప్రజలు వాపోయారు. ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించడంతో పోలీసులను పిలిపించి దరఖాస్తు దారులను బయటికి పంపించి వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఉద్దేశపూర్వకంగానే దరఖాస్తులను పరిశీలించడం లేదని సీపీఐ జిల్లా నాయకులు వేంకటేష్ ఆరోపించారు.

అర్హుల ఆగ్రహం

మరికల్: రాష్ట్ర ప్రభుత్వం అందజేసే రూ.లక్ష ఆర్థికసాయం కోసం తీసుకుంటున్న ఆదాయ ధృవపత్రంలో అధికారులు ఎక్కువ ఆదాయం చూపడంతో అర్హులు అధికారులపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల, ఆదాయ ధృవపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన కులవృత్తుల వారు ఏడాదికి రూ.1.50లక్షలు ఉంటేనే ప్రభుత్వం రూ.లక్ష ఆర్థికసాయం అందుతుందని తెలిపారు. కానీ అధికారులు కావాలనే రూ.1.60లక్షలు వేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే.. వారు ప్రజలతో దురుసుగా వ్యవహరించడం చర్చనీయంగా మారింది.



దరఖాస్తుదారులు లోపలికి రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

తహసీల్దార్ కార్యాలయం కిటకిట

మాగనూర్: విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో విద్యార్థులు ప్రతి ఒక్కరూ కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాలకు క్యూలు కడుతున్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన వర్గాల కుల, చేతి వృత్తిదారులకు రూ. లక్ష ఆర్థికసాయం అందజేస్తుండటంతో దరఖాస్తు చేసుకునేందుకు మీసేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉండటంతో కులవృత్తిదారులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు కోసం ఒక్కసారిగా తహసీల్దార్ కార్యాలయానికి గుంపులుగా తరలివస్తున్నారు. దీంతో సర్వర్ సమస్య ఏర్పడుతోంది. దరఖాస్తుదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సర్వర్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారులు

గుర్తింపు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మక్తల్: మండల కేంద్రంలో గుర్తింపులేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి వంశీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైతన్య పాఠశాల ఎదుట విద్యార్థులు నిరసన తెలిపారు. ఐఐటీ, నీట్, మెడికల్, వివిధ పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్, సురేష్, వినయ్, శరణ్,రాజు, శివప్రసాద్, లక్ష్మణ్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

విజయవంతం చేయండి

మక్తల్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు విజయవంతం చేయాలని సమన్వయకర్త రంగనేని అభిలాష్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. 16–35 సంవత్సరాల విద్యార్థినీ, విద్యార్థులు అర్హులన్నారు. ప్రతిభ కనబరిచిన 40 మందికి బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నారాయణపేట కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, తులసిరాజు, నూరుద్దీన్, రాజప్పగౌడ్, చెన్నయ్యసాగర్, పరమేశ్వర్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రవి కుమార్, వివేక్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఊట్కూరు: మండలంలోని కొల్లూరు పాఠశాలలో ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రూ.18 వేలు వెచ్చించామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భీమాచారి, సర్పంచ్ సరోజాసమృద్ధి, ఎంపీటీసీ విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు కృష్ణా, గోపాల్‌రెడ్డి, చిన్నబీరప్ప తదితరులు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు